విడిసిలపై చర్య తీసుకోవాలి

● తెలంగాణ గీత పనివారల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా, తాళ్లరాంపూర్ గీత వృత్తిదారులను గ్రామ బహిష్కరణ చేసిన విడిసిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గీత పనివారల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావుకు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని సమర్పించారు. తాటివనం ధ్వంసంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌గ్రేషియో రూ. 10 లక్షలకు, పెన్షన్ రూ. 5000 పెంచాలని, అర్హులైన గీతవృత్తిదారులందరికి సేఫ్టీ కిట్స్ అందించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులను కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్, కో ఆర్డినేటింగ్ సెక్రెటరీ బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కెవిఎల్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి. నరేంద్ర ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్ అకాడమి విద్యార్థికి 934వ ర్యాంక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిల్స్ ఫలితాల్లో ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమి తెలుగు సాహిత్య విద్యార్థి గోకమల్ల అంజనేయులు 934వ ర్యాంకు సాధించారని అకాడమి చైర్మన్ నంద్యాల నర్సింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంజనేయులుకు చైర్మన్‌తో పాటు ప్రిన్సిపల్ కె సురేందర్‌రెడ్డి, అకాడమి అడ్వైజర్ అండ్ చీఫ్ గార్డెనర్ వై సత్యనారాయణ, కోర్స్ కో ఆర్డినేటర్ జనార్ధన్ దండు, ఆన్‌లైన్ కోర్సు ఎడిటర్ మురళీకృష్ణ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె సతీష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

పిహెచ్‌డి సీట్ల అమ్మకాలపై విచారణ

● టిపిటిఎల్‌ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు యూనివర్సిటీలో పిహెచ్‌డి సీట్ల అమ్మకాలపై విచారణ జరిపించాలని టిపిటిఎల్‌ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకృష్టారెడ్డికి సంఘం ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎ. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పిహెచ్‌డి అడ్మిషన్లు అమ్ముకున్న వైస్‌ఛాన్సలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ వెలువరించిన నాటి నుంచి సీట్లు ఇచ్చేంత వరకు అవకతవకలు జరిగాయని తెలిపారు. పీఎస్‌టీయూ పిహెచ్‌డి తెలుగు (రెగ్యులర్) అడ్మిషన్ ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగినట్టు తెలిసిందని పేర్కొన్నారు. జనవరి 30న విడుదల చేసిన నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్ సైట్ లో పెట్టకుండా దొంగదారిన రిలీజ్ చేశారని పేర్కొన్నారు. అడ్మిషన్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కొమ్ము విజయ్, కట్టా ప్రభాత్, చిట్టి బాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్' అడ్మిషన్లకు త్వరలో నోటిఫికేషన్

● ఉన్నత విద్యామండలి చైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం త్వరలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి 'దోస్త్' ద్వారా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించనుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీనియర్ ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులను చైర్మన్ అభినందించారు. అలాగే తెలంగాణలోని ఆయా విశ్వవిద్యాలయాల్లో ఉన్న డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. తాజాగా కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా (పిబిఎల్) తదితర అంశాలను కొత్తగా కోర్సుల రూపంలో విద్యార్థులకు చేరువ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలిచేందుకు అవసరమైన మేరకు సిలబస్‌లో మార్పులు, చేర్పులు చేస్తున్నట్టు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రతిభాపాటవాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ఉన్నత విద్యామండలి లక్ష్యమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దోస్త్ నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయనున్నట్టు తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణ రద్దు కోసం ఉద్యమించాలి

● ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనారిటీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మమత బాంకెట్ హాల్‌లో మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన 'వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగ విరుద్ధం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. మైనారిటీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు నియమించిన జేపీసీలో ప్రతిపక్ష సభ్యులు సూచించిన ఒక్క అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా వక్ఫ్ సవరణ చట్టాన్ని నియంతృత్వంగా ఆమోదించడం సరైనది కాదన్నారు. ఎటువంటి ప్రజాస్వామిక చర్చలు లేకుండా.. మంద బలంతో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలని కోరారు. భిన్నత్వంలో ఏకత్వం గల దేశాన్ని ఏకపక్ష విధానాలతో రాతి యుగాల్లోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేడారం జాతరకు శాశ్వత పనులు చేపట్టాలి

● అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలి

● మంత్రి సీతక్క



సమావేశంలోమాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే మేడారం మహా జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులు శాశ్వతంగా నిలిచేలా చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈ శాశ్వత ప్రతిపాదిక పనులకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.145 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన 2026లో జరగనున్న మేడారం మహా జాతరపై అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారంలో చేపట్టనున్న పనులపై అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో లాగా జాతరకు రెండు నెలల ముందు పనులు ప్రారంభించి హడావుడిగా పనులు పూర్తి చేయకుండా కనీసం ఆరు నెలల సమయం తీసుకుని పూర్తి నాణ్యతతో పనులు ముగించాలని సూచించారు. వచ్చే సంవత్సరంలో మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరతో పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రెండు పెద్ద పండుగలను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గత మహా జాతర సందర్భంగా మిగిలి ఉన్న రూ.50 కోట్లను రానున్న మహా జాతరకు వినియోగిస్తామని తెలిపారు. గద్దెల పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దరమే కాకుండా జంపన్న వాగుపై పెద్దలు, పిల్లలు సేద తీర్చుకోవడానికి వీలుగా రూ.5 కోట్లతో ఏర్పాట్లు చేయాలన్నారు. గత జాతర సిసి కెమెరా ఫుటేజీలను పరిశీలించి అప్పుడు జరిగిన పొరపాట్లను గుర్తించి మళ్లీ అలాంటివి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికోసం సంబంధిత అధికారులు అంచనాలు తయారు చేయాలని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేయాలన్నారు. కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ.. గతంలో జరిగిన మేడారం మహా జాతర సందర్భంగా పనిచేసిన అధికారులు ఇప్పటికీ జిల్లాలో పనిచేస్తున్నారని, వారి అనుభవాలను పరిగణలోకి తీసుకొని రానున్న మహా జాతరను విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.మహేందర్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, ములుగు డిఎస్‌పి రవీందర్, ఆర్‌డిఒ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఎఫ్‌డిఒ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో పెరిగిన ఉత్తీర్ణత

● గతేదాది కన్నా ఫస్టియర్‌లో 5.83 శాతం, సెకండియర్‌లో 1.91 శాతం పెరుగుదల

● ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అమ్మాయిలదే హవా

● ప్రథమ సంవత్సరంలో మేడ్చల్ ఫస్ట్, మెదక్ లాస్ట్

● ద్వితీయ సంవత్సరంలో ములుగు ఫస్ట్, కామారెడ్డి లాస్ట్

● మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

● ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ వార్షిక ఫలితాలను మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్ బోర్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత పెరిగింది. గతేడాది కన్నా ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 14.06 శాతం, ద్వితీయ సంవత్సరంలో 13.13 శాతం పెరగడం గమనార్హం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 66.89 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 71.37 శాతం ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఇంటర్ ఫస్టియర్‌లో 61.06 శాతం, ద్వితీయ సంవత్సరంలో 69.46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలే హవా కొనసాగించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోనూ వారే పైచేయి సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 4,39,302 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 2,93,852 (66.89 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 2,23,407 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 1,64,876 (73.8 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 2,15,895 మంది అబ్బాయిలు పరీక్షలు రాస్తే, 1,28,976 (59.74 శాతం) మంది పాసయ్యారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు 14.06 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 49,128 మంది పరీక్ష రాస్తే, 28,339 (57.68 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇందులో 24,860 మంది అమ్మాయిలు పరీక్షలు రాయగా, 18,418 (74.09 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 24,268 మంది అబ్బాయిలు పరీక్షలు రాస్తే, 9,921 (40.88 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే ఒకేషనల్ విభాగంలోనూ అబ్బాయిల కన్నా అమ్మాయిలు 33.21 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత పొందారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం రెగ్యులర్‌లో 3,99,943 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,85,435 (71.37 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 2,06,161 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తే, 1,60,244 (77.73 శాతం) మంది ఉతీర్ణత పొందారు. 1,93,782 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 1,25,191 (64.60 శాతం) మంది పాసయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనూ అబ్బాయిల కంటే అమ్మాయిలు 13.13 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ జనరల్ విభాగం రెగ్యులర్‌లో 40,864 మంది పరీక్షలు రాస్తే, 28,713 (70.26 శాతం) మంది విద్యార్థులు పాసయ్యారు. ఇందులో 21,387 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరు కాగా, 18,222 (85.20 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 19,4770 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 10,491 (53.86 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషన్ విభాగంలోనూ అబ్బాయిల కన్నా అమ్మాయిలు 31.34 శాతం మంది అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి (సిఒఇ) జయప్రదబాయి, జాయింట్ సెక్రెటరీలు వసుంధర, మోహన్, జోత్స్నరాణి, భీంసింగ్, సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు ప్రారంభం

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయి. బుధవారం నుంచి పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఫీజు చెల్లింపునకు తుది గడువు ఈనెల 30వ తేదీ వరకు ఉన్నది. జూన్ మూడు నుంచి ఆరో తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తారు. బుధవారం నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. దరఖాస్తు చేసేందుకు తుది గడువు ఈనెల 30వ తేదీ వరకు ఉన్నది. రీకౌంటింగ్ కోసం ప్రతి పేపర్‌కూ రూ.100, రీవెరిఫికేషన్ కోసం ప్రతి పేపర్‌కూ రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు http://tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. షార్ట్ మెమోలను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

ఫస్టియర్‌లో మేడ్చల్ అగ్రస్థానం

ఇంటర్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 77.59 శాతంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ద్వితీయ సంవత్సరంలో 80.12 శాతంతో ములుగు జిల్లా అగ్రస్థానంలో నిలిచాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి 67,266 మంది పరీక్షలు రాయగా, 52,190 (77.59 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 36,502 మంది అబ్బాయిలు పరీక్షలు రాస్తే, 26,842 (73.54 శాతం) మంది పాసయ్యారు. 30,764 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 25,348 (82.40 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 76.95 శాతం ఉత్తీర్ణత సాధించి రంగారెడ్డి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 76,967 మంది పరీక్షలు రాయగా, 59,227 (76.95 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 70.49 శాతంతో ములుగు జిల్లా మూడో స్థానంలో ఉన్నది. ఈ జిల్లా నుంచి 3,995 మంది పరీక్షలు రాస్తే, 2,816 (70.49 శాతం) మంది పాసయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 46.87 శాతం ఉత్తీర్ణతతో మెదక్ జిల్లా అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 5,519 మంది పరీక్షలకు హాజరుకాగా, 2,587 (46.87 శాతం) ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 81.33 శాతం ఉత్తీర్ణతతో నారాయణపేట జిల్లా అగ్రస్థానంలో, 43.84 శాం ఉత్తీర్ణత సాధించి నిజామాబాద్ జిల్లా చివరిస్థానంలో నిలిచాయి.

సెకండియర్‌లో ములుగు ప్రథమం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం రెగ్యులర్‌లో 80.12 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 1,635 మంది పరీక్షలు రాస్తే, 1,310 (80.12 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 833 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 616 (73.95 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 802 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 694 (86.53 శాతం) మంది పాసయ్యారు. 79.52 శాతం ఉత్తీర్ణతతో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో ఉన్నది. ఈ జిల్లా నుంచి 4,199 మంది పరీక్షలకు హాజరైతే, 3,339 (79.52 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 78.08 శాతం ఉత్తీర్ణతతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 61,505 మంది పరీక్షలు రాస్తే, 48,022 (78.08 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం రెగ్యులర్‌లో 54.93 శాతం ఉత్తీర్ణత సాధించి కామారెడ్డి జిల్లా అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 6,485 మంది పరీక్షలు రాస్తే, 3,562 (54.93 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 88.46 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నది. 60.28 శాతం ఉత్తీర్ణతతో నిజామాబాద్ జిల్లా అట్టడుగున నిలిచింది.

ప్రజలకు వాస్తవాలు చెప్పండి

సజ్జనార్‌కు టిజిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ వివరణ



ఓఎస్‌డికి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఆర్‌టిసిని నిర్వీర్యం చేయడానికి పాలకులు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టి, సంస్థను రక్షించుకుంటున్నది కార్మికులు, కార్మిక సంఘాలేనని టిజిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. అలాంటి కార్మిక సంఘాలను ప్రజల్లో అప్రతిష్టపాలు చేసేలా ఆర్‌టిసి యాజమాన్యం ప్రకటన చేయడాన్ని తప్పుపట్టింది. ఈనెల 11వ తేదీ యాజమాన్యం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కొన్ని వాస్తవాలు ఉన్నా, అనేక అర్ధసత్యాలు ఉన్నాయని అభిప్రాయపడింది. ప్రజలకు, కార్మికులకు వాస్తవాలు మాత్రమే చెప్పాలని కోరుతూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ ఛాంబర్‌లో ఆయన ఒఎస్‌డి భానుప్రసాద్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఆర్‌టిసి యాజమాన్యం కార్మికుల సమస్యలపై స్పందించి, వారి సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఎస్‌ఆర్‌బిఎస్ మూసివేత ప్రతిపాదనేమీ లేదని బహిరంగంగా ప్రకటించడాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. మూడేండ్ల క్రితం ఎస్‌ఆర్‌బిఎస్‌ను మూసివేయడానికి యాజమాన్యం ప్రయత్నించిన విషయం వాస్తమనీ, ఆ సందర్భంలో ఆర్‌టిసి నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా రిటైరైనవారు, డిపో మేనేజర్లు, ఇతర సూపర్‌వైజర్లు, రిటైర్డ్ కార్మికులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. ఎస్‌ఆర్‌బిఎస్ ట్రస్ట్‌కు ఆర్‌టిసి యాజమాన్యం చెల్లించాల్సిన రూ.వంద కోట్లు ఇస్తే, రిటైర్డ్ కార్మికులకు మంత్లీ క్యాష్ బెనిఫిట్‌ను చెల్లించవచ్చని సూచించారు. ఆర్‌టిసిలోని కార్మిక సంఘాలు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సంస్థ పరిరక్షణకు కృషి చేస్తున్నాయంటూ గతంలోని పలు సంఘటనలు, ఆందోళనలు, సమ్మెలు వంటి చరిత్రను ప్రస్తావించారు. కార్మిక సంఘాలన్నింటినీ ఒకేగాటన కట్టి, యాజమాన్యం దుందుడుకు వ్యాఖ్యలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. ఏదైనా సంఘంతో ఇబ్బంది ఉంటే, ఆ సంఘం పేరును ప్రస్తావించి, వివరణ ఇవ్వాలని సూచించారు. 2013 ఆర్పీఎస్ బాండ్ డబ్బులను దశల వారీగా చెల్లించారనీ, 2017 ఆర్పీఎస్‌ను ఏకపక్షంగా 21 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేశారనీ, 2019 నుంచి 2025 జనవరి వరకు రావలసిన కరువు భత్యం చెల్లించారని తెలిపారు. 2017 ఆర్పీఎస్ అరియర్స్‌ను రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని ప్రకటించారనీ, ఆ సొమ్ము ఎంత వస్తుందో కార్మికులకు చెప్పలేదన్నారు. ఏడాదైనా ఇప్పటికీ దానిపై స్పష్టత ఇవ్వలేదని ఆక్షేపించారు. అలాగే 179 నెలల డిఏ అరియర్స్ కూడా రిటైర్మెంట్ సమయంలోనే చెల్లిస్తామని సంస్థ సర్క్యులర్ ఇచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేసిందని చెప్పారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.20 కోట్ల ఇన్సూరెన్స్‌ను వివిధ బ్యాంకులు చెల్లిస్తున్నాయనీ, దీనిలో సంస్థ చెల్లించే ప్రీమియం ఏమీ లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయాల ప్రకారం విద్యుత్ బస్సుల్ని ఆర్టీసీలోకి గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ పద్ధతిలోనే తీసుకోవాలనీ, అందుకు భిన్నంగా టిజిఎస్ఆర్‌టిసిలో విద్యుత్ బస్సులను ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతోనే నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా విధాన నిర్ణయం చేసిందో లేదో స్పష్టత ఇవ్వాలని కోరారు.

తెలంగాణ ఇంటర్‌లో శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ ఇంటర్మీడియట్ పలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించించారు. 2025 ఇంటర్ ఫలితాలు మంగళవారం వెలువడిన నేపథ్యంలో మంచి ఫలితాలు పొందిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 996 మార్కులు సాధించి చరిత్ర సృష్టించారు. ఇది స్టేట్ టాపర్ మార్కులుగా ఆ సంస్థ ప్రకటించింది. కాగా 995 మార్కులపైన ఏడుగురు, 994పైన 46 మంది, 990పైన 610 మంది, 985పైన1776 మంది, 980పైన 3050 మంది, 950పైన 9657 మంది మార్కులు పొందినవారిలో ఉన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 103 మంది విద్యార్థులు 470 మార్కులకుగాను 468 సాధించడం గమనార్హం. 467 మార్కులపైన 462 మంది, 466పైన 1073 మంది, 460పైన 4490 మంది, 450పైన 8479 మార్కులు సాధించారు. అలాగే జూనియర్ ఇంటర్ బైపిసిలో 440 మార్కులకుగాను 26 మంది విద్యార్థులు 438 మార్కులు సాధించారు. అలాగే 437పైన 136 మంది, 436పైన 304 మంది, 435పైన 459 మంది, 460పైన 4490 మంది, 430పైన 1495 మంది విద్యార్థులు ఉన్నారు. ఇదిలావుండగా ఇప్పటికే శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో 300 మార్కులకుగాను 300 సాధించి ఓపెన్ కేటగిరిలో రెండు అఖిలభారత స్థాయి ర్యాంకులు సాధించిందని ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ చెప్పారు. పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు చెప్పారు. పోటీపరీక్షల్లోనూ మా సంస్థ విద్యార్థులు టాపర్లుగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. జాతీయస్థాయిలోనూ మంచి ఫలితాలు వస్తున్నాయని వివరించారు. మా సంస్థపై నమ్మకం ఉంచిన విద్యార్థులు తల్లిదండ్రులు, దోహదపడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాలకు అకాడమీ తరపున అభినందించారు.

ఇది ప్రజల 'భూభారతి'

● భూసమస్యలన్నింటికీ పరిష్కారం

● రైతుల సూచనలతో అవసరమైతే చిన్న మార్పులు చేస్తాం

● అవగాహనా సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నో ఏండ్లుగా పేరుకుపోయిన భూ సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టంతో లభించనున్నదని, ఇది ప్రజల చట్టమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. రోమన్ క్యాథలిక్ మత గురువు పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో దొరలు చేసిన ధరణి చట్టం కాదని, ఇది ప్రజా పాలనలో ప్రజల కోసం చేసిన భూభారతి చట్టం అని అన్నారు. 2025, మే 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మినహా మిగతా 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలం ఎంపిక చేసి భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు పరుస్తామన్నారు. గతంలో సాదాబైనామా పరిష్కారానికి ధరణిలో అవకాశం లేకపోవడంతో కోర్టు కూడా ఏమీ చేయలేకపోయిందని తెలిపారు. 9.26 లక్షల భూసమస్యల దరఖాస్తులను భూభారతిలో పరిష్కరిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు సూచించిన చిన్న చిన్న మార్పులను చేసుకోవడానికి వీలుగా చట్టం రూపొందించామన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ రెవెన్యూ, ఫారెస్ట్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ భూములపై పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందించొచ్చన్నారు. త్వరలో 6వేల మంది సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి నియామకం చేస్తామన్నారు. వారితో భూ హద్దులతోపాటు భూమి (నక్షాలు) కొలతలతో కూడిన మ్యాప్‌లు తీపిస్తామని వివరించారు. జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయాల నివేదిక ఇవ్వాలన్నారు.

కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదని, కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థ ఉండటం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. తహసీల్దార్‌లు రెవెన్యూ సిబ్బందితో గ్రామాలకు వస్తారని, దరఖాస్తు స్వీకరించడమే కాకుండా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తారని, లేని పక్షంలో ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చని చెప్పారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే కలెక్టర్‌ను కలవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరికల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఆవేజ్ చిస్తీ, భువనగిరి మార్కెట్ చైర్మెన్ రేఖ బాబురావు, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మెన్ బీమానాయక్, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగళ్ళపల్లి రవికుమార్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మెన్లు బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వరు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేటలోని సబ్ స్టేషన్ వద్ద రైతులు సుమారు గంట సేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి పండించిన పంటను కోసి ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే నెల రోజులవుతున్నా కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకోతో గ్రామ పరిధిలోని వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాంతో ఎస్ఐ నరేష్ అధికారులతో మాట్లాడి రైతులను శాంతింపజేశారు. కొనుగోళు వెంటనే ప్రారంభిస్తామని హామీనివ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అవ్వడంతో మనస్తాపం చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాసాల అరవింద్ యాదవ్(17) భువనగిరి పట్టణంలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో ఎంపిసి ఫస్టియర్ చదివాడు. మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దాంతో మనస్తాపానికి గురైన అరవింద్ ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన అతని తల్లి స్థానికుల సహకారంతో వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు స్వీట్ వన్‌షాప్ 4వ శాఖ ప్రారంభం

- హాజరు కానున్న సినీనటి నాగళ్ళ అనన్య

ప్రజాశక్తి - హైదరాబాద్

స్వీట్ వన్ మిఠాయి షాప్ నాలుగవ షోరూంను హఫీజ్ పేట్ విఆర్ కాలనీలో బుధవారం ప్రముఖ సిటీ సినీనటి నాగళ్ళ అనన్యచే ప్రారంభిచనున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తమ షాపులో సాంప్రదాయ రుచితో కూడిన అన్ని రకాల మిఠాయ్‌లు సహా కాకినాడ కాజా మడత కాజా, లడ్డు జిలేబి అరిసెలు లభించనున్నాయని శంకర్ నారాయణ పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా 199 రూపాయలకే కిలో స్వీట్ అందిస్తున్నామన్నారు. తమ షాప్‌లో స్వచ్ఛతకు నాణ్యతకు మన్నికైన సీట్లను అందిస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజలు హాజరై తమ అద్భుతమైన ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు.

పోలవరం బ్యాక్‌బాటర్ ముంపుపై అధ్యయనం!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ముంపుపై అధ్యయనం చేసేందుకు రంగం సిద్ధమవుతున్నది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ పలుమార్లు కేంద్ర జలవనరుల సంఘం (సిడబ్ల్యూసీ)కి లేఖలు రాసింది. తాజాగా గత సోమవారం మరో లేఖను పంపింది. ఆరు పారామీటర్ల ఆధారంగా అధ్యయనం చేయాలని తెలంగాణ కోరుతుంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సైతం ఇందులో భాగస్వామి కానుంది. ఈ విషయమై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాంకేతిక అంశాలపై గతంలో నాలుగుసార్లు సమావేశాలు జరిగాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ చెప్పినట్టుగా కిన్నెరసాని, ముర్రేడువాగు నదుల ముంపుపై అంచనాకు రానున్నారు. బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఫుల్ రివర్ లెవల్‌పై తెలంగాణ, ఆంధ్ర సంయుక్త సర్వేపై సమాలోచనలు చేయనున్నారు. భద్రాచలం, మణుగూరు వాటర్ ప్లాంటుకు సంబంధించిన నీటిస్థాయిలను సైతం తనిఖీ చేయాల్సి ఉంటుంది. ముంపు మూలంగా తెలంగాణపై ఎలాంటి ప్రభావం ఉండనుందో ఈ అధ్యయనం ద్వారా తేల్చాలని భావిస్తున్నారు. ఈమేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇప్పటికే ఎపి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. తెలంగాణతో సమన్వయం చేసుకుంటూ ముంపు జలాలు, వాటి ప్రభావంపై అధ్యయనం చేయాలంటూ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ఎపికి ఇప్పటికే పంపింది. ఈనెల 8న అంతరాష్ట్ర జలవివాదాలపై జరిగిన సమావేశంలో ఆంధ్ర, తెలంగాణ సంయుక్త సర్వే చేయాలని సిడబ్ల్యూసి ఆదేశించింది. ఆరు నుంచి ఏడు పెద్ద నీటి ప్రవాహాలను పరిశీలిస్తే తెలంగాణపై ముంపు జలాల ప్రభావం అంచనా వేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సిడబ్ల్యూపి ఇరు రాష్ట్రాలను కోరింది. ఇందుకు పీపీఏ చొరవచూపాలని సూచించింది.

టిఎన్‌ఎ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి విస్డం చౌదరి నియామకపత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, గనుగుపెంట తండాలో గిరిజన గ్రామంలో జన్మించిన లక్ష్మణ్ 2017లో నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌ఓఎ)ను స్థాపించారు. దాని ద్వారా నర్సింగ్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారంతో పాటు వారి హక్కుల సాధన కోసం కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి గిరిజన ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమాలను చేపట్టారు. 2022లో నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డుతో పాటు పలువురి ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి లలిత పాల్గొన్నారు.

ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపు

- యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక
- మే మొదటి వారంలో మరో 28 మండలాల్లో 'భూభారతి'
- ప్రభుత్వ ఆలోచనలకనుగుణంగా కలెక్టర్లు పని చేయాలి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఆలోచనలు, ప్రాధాన్యతలకనుగుణంగా పని చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టం అమలుపై కలెక్టర్లు, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్‌ఆర్‌ఎస్ తదితరాంశాలపై కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు అవసరమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామనీ, ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు.

భూభారతి చట్టంపై లోతుగా అధ్యయనం చేసి ప్రజల్లోకి వెళ్లాలని కలెక్టర్లకు సూచించారు. భూభారతి పైలట్ ప్రాజెక్టు అమలు చేస్తున్న నాలుగు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలకుగానూ 16 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన భూ సదస్సుల్లో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో 1076 ఫిర్యాదులు, నారాయణపేట జిల్లా మద్దూర్‌లో 233, కామారెడ్డి జిల్లా లింగంపేట 810, ములుగు జిల్లా వెంకటాపురంలో 3786 మొత్తం 5,905 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులను పూర్తి చేయాలని సూచించారు. ఈ నాలుగు పైలట్ మండలాల్లో వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మే మొదటి వారంలో హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని పైలట్ మండలంగా తీసుకుని 28 మండలాల్లో భూభారతి చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. దీనికి ముందు ఆ నాలుగు మండలాల్లోని తహశీల్దార్ నేతృత్వంలోని అధికారుల బృందం, ఈ28 మండలాల్లోని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మరో ఇద్దరు అధికారులకు భూభారతి చట్టంపై వర్క్‌షాపు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో 605 మండలాలకుగానూ 159 మండలాల్లో భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. సిసిఎల్‌ఎ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను కూడా పైలట్ మండలాల్లోని రెవెన్యూ సదస్సుల్లో చేర్చాలని సూచించారు.

యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే మొదటివారంలోగా పూర్తి చేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. 200 దరఖాస్తులకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలన్నారు. అనర్హులను ఎంపిక చేస్తే ఆ గెజిటెడ్ అధికారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగితేనే డబ్బులు విడుదల చేయాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు ప్రతి సోమవారం వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమ చేయాలని సూచించారు. లబ్ధిదారులకు తక్కువ ధరకు స్టీల్ సిమెంట్ ఇచ్చే విధంగా త్వరలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఆదిలాబాద్, జగిత్యాల, నిజామాబాద్, వనపర్తి, మంచిర్యాల, గద్వాల జిల్లాలోపాటు మొత్తం 11 జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఆశించిన స్థాయిలో లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంచబోం

ఎల్‌ఆర్‌ఎస్‌కు గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుందనీ, మరోసారి గడువు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మరో వారంరోజుల వ్యవధి మాత్రమే ఉందని ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలులో కలెక్టర్ల పని తీరు అభినందనీయమన్నారు. సమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, గృహనిర్మాణ కార్పొరేషన్ ఎమ్‌డీ వీపీ గౌతమ్, సీసీఎల్‌ఏ డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ రికార్డు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్ బోర్డు చరిత్రలోనే వరుసగా రెండోసారి అత్యుత్తమ మార్కులతో నారాయణ విద్యాసంస్థ ఆల్‌టైం రికార్డును సృష్టించింది. మంగళవారం హైదరాబాద్‌లో నారాయణ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సత్తాచాటారని అన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 469 మార్కులతో పి వర్షిణి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి విజయదుందుభి మోగించారని చెప్పారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వెయ్యి మార్కులకు 13 మంది విద్యార్థులు 995 మార్కులను సాధించారని వివరించారు. బైపీసీలో వెయ్యి మార్కులకు ఇద్దరు 995 మార్కులను పొందారని అన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 468 మార్కులను 132 మంది, 467 మార్కులను 487 మంది, 466 మార్కులను 856 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వెయ్యి మార్కులకు 995 మార్కులను 13 మంది సాధించారని అన్నారు. 994 మార్కులను 30 మంది, 993 మార్కులను 73 మంది, 992 మార్కులను 106 మంది సాధించారని చెప్పారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 440 మార్కులకు 438 మార్కులను 13 మంది, 437 మార్కులను 27 మంది, 436 మార్కులను 44 మంది, 435 మార్కులను 34 మంది విద్యార్థులు పొందారని అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 995 మార్కులు ఇద్దరు, 994 మార్కులను నలుగురు, 992 మార్కులను ఇద్దరు, 992 మార్కులను ఐదుగురు సాధించారని చెప్పారు.

ఫేసియల్ రెకగ్నైజేషన్ సరికాదు

- తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫేసియల్ రెకగ్నైజేషన్ -బేస్డ్ ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటండెన్స్ (ఎఇబిఎస్) అమలు చేయడం సరికాదని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి.నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ మహమ్మద్ ఖాజా రవూఫుద్దీన్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూకు వినతిపత్రం అందజేశారు. వైద్యారోగ్య శాఖలోని డిఎంఇ, టివివిపి, డిపిహెచ్, ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగాల్లోని ప్రభుత్వ వైద్యుల ప్రైవసీ, డాటా సెక్యూరిటీకి ఇబ్బందికరంగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు సాంకేతిక తదితర సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు.

తెలంగాణ దేశానికి గేట్‌వే

- పరస్పర సహకారంపై డిప్యూటీ గవర్నర్‌తో చర్చలు
- హిరోషిమాను సందర్శించిన సిఎం బృందం
- ప్రిఫెక్చరల్ అసెంబ్లీని ఉద్దేశించి మాట్లాడిన రేవంత్
- మహాత్మాగాంధీకి నివాళులు
- ముగిసిన ఏడు రోజుల సిఎం బృందం పర్యటన


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ బృందం మంగళవారం ఒసాకా నుంచి హిరోషిమాకు చేరుకుంది. అక్కడి పీస్ మెమోరియల్ సందర్శించి గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్థానిక డిప్యూటీ గవర్నర్‌తో భేటీ అయ్యారు. కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి తెలంగాణ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా రేవంత్ అన్నారు. శాంతి, సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని కొనియాడారు. తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం తయారు చేసే క్లీన్ టెక్నాలజీ, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలపై చర్చించారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, హిరోషిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారంపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. అనంతరం సిఎం బృందం హిరోషిమా ప్రిఫెక్చర్‌ను సందర్శించింది. స్థానిక అసెంబ్లీని ఉద్దేశించి ఈ సందర్భంగా సిఎం ప్రసంగించారు. "హిరోషిమా అంటే శాంతికి చిహ్నం. అణుబాంబుల విధ్వంసాన్ని తట్టుకుని గొప్పనగరంగా ఎదిగింది. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించింది. హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో అన్ని రంగాల్లో విజయం సాధించిన రాష్ట్రం' అని పేర్కొన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నాయనీ, మరిన్ని కంపెనీలు తమతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణను సందర్శించి, రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. తెలంగాణ దేశానికి గేట్‌వేగా.. ప్రపంచానికి విస్తరించే వేదికగా ఉంటుందని అన్నారు. హిరోషిమా-హైదరాబాద్, జపాన్-తెలంగాణ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దామని పిలుపు నిచ్చారు. అనంతరం. తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమై వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య సహకారంపై చర్చించింది అనంతరం హిరోషిమా శాంతి స్మారక వనంలో బాంబు దాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. 1945లో దాడి తర్వాత నగరంలో నిలిచి ఉన్న ఏకైక నిర్మాణం అణు బాంబు డోమ్‌ను సందర్శించి స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో సీఎం రేవంత్ బృందం ఏడు రోజుల పర్యటన ముగిసింది. మంగళవారం రాత్రి ఒసాకాలోని కాన్సాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుంచి బయల్దేరి బుధవారం ఉదయానికి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

సింగరేణి - ఆర్‌వియుఎన్‌ఎల్ ఒప్పందం

- వచ్చే నెల రెండో వారంలో సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

దేశంలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనికి తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్‌ఎల్) మధ్య 3,100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు దీనికి నిదర్శనమని తెలిపారు. తెలంగాణ- రాజస్థాన్ మధ్య గతంలో చేసుకున్న సోలార్, థర్మల్ విద్యుత్ ఒప్పందాల్లో భాగంగా మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. ఈ ఒప్పందం ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణలో నెలకొల్పే 1,600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లలో ఒకటైన సింగరేణి 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను వచ్చే నెల రెండో వారంలో శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్లాంట్ నిర్మాణ బాధ్యతలను కేంద్రప్రభుత్వ సంస్థ అయిన బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించామని తెలిపారు. మరో 3,100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఇరు కంపెనీలు సంయుక్త భాగస్వామ్య కంపెనీని నెలకొల్పేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రాజస్థాన్‌లో ఏర్పాటు చేసే 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం కోసం భూ పరిశీలన పూర్తిచేయాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సిఎండి ఎన్ బలరామ్, సింగరేణి డైరెక్టర్లు, రాజస్థాన్ ఆర్‌వియుఎన్‌ఎల్ చీఫ్ ఇంజనీర్ శ్రీ వి.పి గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ భారతి తప్పులతడక

- రక్షిత కౌలుదారు, కాస్తుకాలం ఊసేలేని కొత్త చట్టం
- రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ భారతి తప్పులతడకగా ఉందనీ, సమగ్ర భూ సర్వే నిర్వహిస్తేనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి అధ్యక్షతన "భూ భారతి చట్టం... భూసమస్యలన్ని పరిష్కరిస్తుందా?" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి చట్టం రైతులకు శాపంగా మారిందనీ, తాము అధికారంలోకి వస్తే కొత్త చట్టం తెస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తెచ్చారని గుర్తు చేశారు. అయితే అందులో కూడా చిన్న, సన్నకారు రైతులకు న్యాయం జరిగే అంశాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ధరణిలో కాస్తు కాలం తొలగించడం వల్ల తాతల, తండ్రుల కాలం నుంచి భూమిని సాగు చేసుకుంటున్న వారికి కాకుండా, పట్టాదారులంటూ దేశంలో లేని వారికి పాసు పుస్తకాలిచ్చారని విమర్శించారు. కాస్తుకాలం, రక్షిత కౌలు దారు చట్టంపై భూ భారతిలో సమాధానం లేదని పేర్కొన్నారు. సమగ్ర భూ సర్వే జరపకుండా భూధార్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సర్వే కోసం ఆరు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడాన్ని తపుపట్టారు. ప్రయివేటు సర్వేయర్లు ఎవరికి డబ్బులిస్తే వారి వైపు మొగ్గు చూపుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

సర్వేయర్లను రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన నియమించాలని సూచించారు. భూ రికార్డుల తప్పుల సవరణలకు ఫీజులు వసూలు చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ సర్వే జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ అసైన్డ్ భూమి పేరు సవరణకు, ఇండ్ల స్థలాల పట్టాలకు కలెక్టర్ మాత్రమే సవరణ చేసే అధికారం రూల్స్‌లో పొందుపరిచారని గుర్తు చేశారు. ఎంఆర్‌వో, ఆర్డీవోలకు అధికారాలు కట్టబెట్టామని చెబుతున్నప్పటికి వాస్తవంలో కనిపించడం లేదని పేర్కొన్నారు. సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు, అభాది (గ్రామ కంఠం) భూముల రికార్డులు విడివిడిగా రాయాలని ఆదేశించడం సరైనదే ఐనప్పటికీ, ఇంత వరకు గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నిర్ణయమే జరగలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, పట్నం రాష్ట్ర కార్యదర్శి డిజి నర్సింహ్మారావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభులింగం, సహాయ కార్యదర్శి డిజి నరేంద్ర ప్రసాద్,రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, ఎఐకెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ తదితరులు మాట్లాడారు. భూ భారతిలో సవరణలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సమావేశం తీర్మానించింది.

సమ్మెకు కలిసిరండి

- జెఎసి విజ్ఞప్తి
- కార్మిక పోరాటాలకు నష్టం చేయం-ఎస్‌డబ్ల్యూఎఫ్
- అన్ని సంఘాలు కలిస్తేనే మద్దతు ఇస్తాం-ఎస్‌డబ్ల్యూయూ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసిరావాలని టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి విజ్ఞప్తి చేసింది. మంగళవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న అధ్యక్షతన కార్మిక సంఘాల సమావేశం జరిగింది. యూనియన్ల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు, భేషజాలను వీడి, కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా ఆర్‌టిసిలోని అన్ని సంఘాలు సమ్మెలో భాగస్వామ్యం కావాలని జెఎసి కో చైర్మన్ కె హన్మంతు, వైస్ చైర్మన్ ఎమ్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదగిరి కోరారు.

సమావేశంలో పాల్గొన్న టిజిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి విఎస్ రావు మాట్లాడుతూ... ఆర్‌టిసిలోని అన్ని సంఘాలు ఐక్యం కాకుండా సమ్మెకు వెళ్తే నష్టం జరుగుతుందనీ, వాటన్నింటినీ ఒకేతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు చేయాలని సూచించారు. జెఎసిగా ఏకపక్షంగా సమ్మె నోటీసు ఇవ్వడం సరికాదనీ, దీనిపై గతంలోనే జెఎసికి రాతపూర్వకంగా ఐదు సూచనలు చేస్తూ తమ రాష్ట్ర కమిటీ అభిప్రాయాలను తెలిపిందన్నారు. అనేక అవాంతరాలతో ఇప్పటికి రెండుసార్లు సమ్మె నోటీసులు ఇచ్చారనీ, దానికంటే ముందు ఆర్‌టిసిలోని అన్ని సంఘాలను కలుపుకొని వెళ్ళే ప్రయత్నాలు చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ప్రారంభం నుంచి మద్దతు ఇవ్వమని కోరుతున్నారే తప్ప, అన్ని సంఘాల అభిప్రాయాలు తీసుకొనే ప్రయత్నం చివరివరకు చేయలేదని చెప్పారు. అయినా ఆర్‌టిసి కార్మికుల పోరాటానికి నష్టం కలిగించే చర్యల్ని ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎన్నడూ చేయబోదనీ, సమ్మెకు మద్దతును ఏ రూపంలో ఇవ్వాలో సరైన సమయంలో నిర్ణయం చేస్తామని స్పష్టంచేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి, వైస్ చైర్మన్ జీ అబ్రహం మాట్లాడుతూ ఆర్‌టిసిలోని రెండు జెఎసిలు, ఎస్‌డబ్ల్యూఎఫ్ సహా అన్ని సంఘాలు కలిస్తేనే సమ్మెకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. కార్మిక సంఘాల విశాల ఐక్యత లేకుండా ఏ ఒక్క జెఎసికి మద్దతు ఇవ్వబోమని చెప్పారు. సమ్మె అనివార్యమైతే తమ మద్దతును ఏ విధంగా ఇవ్వాలో అప్పుడే నిర్ణయించి ప్రకటిస్తామన్నారు.

అమెజాన్, వాల్‌మార్ట్‌లపై నిబంధనలకు పాతరేయాలి

- భారత్‌పై అమెరికా ఒత్తిడి

వాషింగ్టన్ : భారత రిటైల్ రంగం, చిరు వ్యాపారాలు తీవ్ర ప్రమాదంలో పడేలా అమెరికా ఒత్తిడి ప్రారంభమైంది. తమ దేశానికి చెందిన అమెజాన్, వాల్‌మార్ట్ లాంటి ఇ-కామర్స్ సంస్థలపై ఇండియా విధిస్తోన్న ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని పట్టుపడుతోందని డొనాల్డ్ ట్రంప్, పరిశ్రమ ఎగ్జిక్యూటివ్స్, లాబీయిస్టులు, యుఎస్ ప్రభుత్వ అధికారుల్ని ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ మంగళవారం ఓ కథనం ప్రచురించింది. భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై ఇటీవల 26 శాతం టారిఫ్‌ను విధించిన విషయం తెలిసిందే. దీన్ని తాత్కాలికంగా వాయిదా వేసినప్పటికీ.. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా యుఎస్ ఇ కామర్స్ సంస్థలపై అమలు చేస్తోన్న పలు నిబంధనలను తొలగించాలని చర్చల్లో అమెరికా ఒత్తిడి చేసిందని తెలుస్తోంది.

భారత్‌కు చెందిన ఇ-కామర్స్ రంగంలోని సంస్థలకు ఇస్తున్న స్థాయిలోనే మిగితా అన్ని సంస్థలకు సమాన అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. గతేడాది వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమై భారత్‌లో ఈ కామర్స్ కంపెనీలపై ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో అన్ని సంస్థలకు ఒకే విధానాన్ని అమలు చేసేలా చూడాలని కోరారు.

భారత్‌లో ఇ-కామర్స్ మార్కెట్ విలువ 125 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.10 లక్షల కోట్లు)గా ఉంది. ఇందులో అమెజాన్, వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్ కీలక వాటాను కలిగి ఉన్నాయి. అమెజాన్‌కు 4 కోట్లు, ఫ్లిప్‌కార్ట్‌కు 5 కోట్ల చొప్పున డైలీ యాక్టివ్ వినియోగదారులున్నారు. అమెజాన్ 32 శాతం, ఫ్లిప్‌కార్ట్ 38 శాతం చొప్పున మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.

భారత్‌లో విదేశీ ఇ-కామర్స్ సంస్థలు ఇతరులు తయారు చేసిన వస్తువులను మాత్రమే విక్రయించాలని ప్రధాన నిబంధన ఉంది. విదేశీ యాజమాన్యంలోని ఆన్‌లైన్ కంపెనీలు ఇన్వెంటరీ కలిగి ఉండటంతో పాటు, వినియోగదారులకు నేరుగా అమ్మడంపై నిషేధాలు ఉన్నాయి. కాగా.. దేశీయ కంపెనీలు సొంతంగా తయారు చేసుకున్న ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీలుంది. దీన్ని ప్రధానంగా అమెరికా తప్పు పడుతోంది. దీనిని టారిఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానే పొలుస్తోంది.

ఈ నేపథ్యంలో భారత్‌తో చర్చల సమయంలో తమ దేశ ఇ-కామర్స్ దిగ్గజాల అభిప్రాయాలు, డిమాండ్‌లను అమెరికా చాలా జాగ్రత్తగా భారత్‌లో అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఓ అధికారి పేర్కొన్నట్లు ఫైనాన్సీయల్ టైమ్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే భారత ఇ-కామర్స్ మార్కెట్‌ను తమ సంస్థలకు అనుకూలంగా మరింతగా తెరవాలని భారత్‌పై ఒత్తిడి తీసుకొస్తోందని తెలుస్తోంది.

విదేశీ పెట్టుబడులను స్వాగతించవచ్చని.. అలాగని భారత రిటైల్ మార్కెట్‌ను ఇష్టానుసారం మార్చేసి చిరు వ్యాపారుల ప్రయోజనాలను దెబ్బతీయడం ఎంత మాత్రం సరికాదని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ పేర్కొన్నారు. ఒక వేళ వాల్‌మార్ట్, అమెజాన్‌లకు భారత్ మార్కెట్‌లో ఆంక్షలు లేని అనుమతులు ఇస్తే ఇవి నేరుగా దుకాణాలు తెరిచి ఇక్కడి రిటైల్ మార్కెట్‌ను పూర్తిగా నాశనం చేయనున్నాయని రిటైల్ వర్తకుల ప్రధాన ఆందోళనగా ఉంది.

ఎయిర్‌టెల్ చేతికి అదానీ స్పెక్ట్రం

న్యూఢిల్లీ : అదానీ గ్రూపునకు చెందిన స్పెక్ట్రంను భారతీ ఎయిర్‌టెల్ సంస్థ స్వాధీనం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్‌తో కలిసి అదానీ డేటా నెట్‌వర్క్స్‌కు చెందిన 26గిగాహెడ్జ్ బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జి సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుందని ఆ సంస్థ పేర్కొంది. 2022లో జరిగిన స్పెక్ట్రం వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ రూ.212 కోట్లతో 400 మెగాహెడ్జ్ స్పెక్ట్రంను దక్కించుకుంది. గుజరాత్, ముంబయి, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కర్నాటక, తమిళనాడులోని ఈ స్పెక్ట్రంను ఇక ఎయిర్‌టెల్ ఉపయోగించుకోనుంది. కాగా ఎంత మొత్తానికి ఈ స్పెక్ట్రం క్రయ, విక్రయం జరిగిందనే విషయాన్ని ఇరు సంస్థలు వెల్లడించకపోవడం గమనార్హం.

ఇమామి ప్యూర్‌గ్లోకు రాశి ఖన్నా ప్రచారం

న్యూఢిల్లీ : ఇమామి లిమిటెడ్ తమ పర్సనల్ కేర్, హెల్త్ కేర్ కంపెనీ ఇమామీ ప్యూర్ గ్లోని పరిచయం చేసింది. దీనికి నటీ రాశి ఖన్నాను బ్రాండ్‌అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ప్రకటించింది. తమ కొత్త బ్రాండ్ వినియోగదారులకు సంపూర్ణ స్కిన్ కేర్ సొల్యూషన్స్ ఇస్తూ గుర్తింపును పొందగలదని ఇమామి లిమిటెడ్ మోహన్ గోయంకా పేర్కొన్నారు. దీంతో తాము రూ.4,000 కోట్ల బ్రైటెనింగ్ క్రీమ్ మార్కెట్లోకి అడుగు పెట్టామన్నారు.

మార్కెట్లోకి ఎంజి కోమెట్ బ్లాక్‌స్ట్రోమ్

ప్రజాశక్తి - హైదరాబాద్



జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా కొత్తగా ఆవిష్కరించిన కోమెట్ బ్లాక్‌స్ట్రోమ్ ఎడిషన్‌ను మంగళవారం హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.7.80 లక్షలుగా నిర్ణయించింది. ప్రతీ కిలోమీటర్‌కు బ్యాటరీ రెంటల్ రూ.2.5 చెల్లించాల్సి ఉంటుందని ఎంజి హైదరాబాద్ డీలర్ ప్రిన్సిపల్ అభయ్ దుబే తెలిపారు. దీన్ని రూ.11,00 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చన్నారు.